ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-4, (Oct,Nov,Dec), 2025

# వావిలికొలను సుబ్బారావుగారి 'సులభ వ్యాకరణము' పరిశీలన

**Mr. Kappala Suresh,** Ph.D. Research student

sureshbabu147147@gmail.com

Department of Telugu, University of Hyderabad, Hyderabad- 500046, TS. India.

Article Received: 25/09/2025

Article Accepted: 28/10/2025

Published Online: 29/10/2025

DOI:10.53414/Sahithyatharangini.2025.2450

## 1.ఉపోద్ఘాతం

మారుతున్న భాషా స్వరూపాన్ని తెలుసుకోవాలమంటే ఏ ఒక్క గ్రంథానికో పరిమితమైతే సరిపోదు. అందుకే తెలుగులో వచ్చిన వ్యాకరణ గ్రంథాలైన, భాషా గ్రంథాలైన ఏ ఒక్కటీ సమగ్రమని చెప్పలేము. ఆయా వ్యాకర్తలుగాని, ఆయా భాషా వేత్తలుగాని వారి కాలానికి సంబంధించిన విషయాలను లేదా వారికి ముందుతరంలో ఉన్న భాషాస్వరూపాన్ని మాత్రమే వివేచించి వ్యాకరణలనుగాని, భాషాగ్రంథాలను నిర్మించగలరు. భవిష్యత్తులో జరగబోయే భాషాపరిణామాన్ని ఏ ఒక్కరూ ముందుగా ఊహించలేరు. కాబట్టి పూర్వవ్యాకర్తలు చెప్పిన విషయాలను తర్వాత వచ్చిన వ్యాకర్తలు వారి కాలానుగుణంగా కొన్ని మార్పులతో వ్యాకరణాలను నిర్మిస్తారు. అలాంటి సందర్భంలో పూర్వవ్యాకర్తల అభిప్రాయాలను, సూచనలను కొన్నింటిని సవరించుకుంటూ, కొన్ని పూరించుకుంటూ, కొన్ని వివరించుకుంటూ ముందుకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అంతమాత్రాన ముందు చెప్పిన వ్యాకర్తలు చెప్పిన నియమాలు తప్పని మనం వారిని తక్కువ భావంతో చూడక్కర్లేదు. ప్రతి ఒక్కరూ వారి వారి కాలాలలో ఎంతో కొంత భాష కోసం కృషి చేసినవాళ్ళే.

ఈ కోవకు చెందివారిలో ఆధునికాంధ్ర వ్యాకర్తలలో వావిలికొలను సుబ్బారావుగారు ఒకరు. తాను రచించిన వ్యాకరణానికి *'సులభవ్యాకరణము'* అని పేరుపెట్టి వారికి పూర్వం రచించబడి, ప్రామాణిక గ్రంథాలుగా భావించబడుతున్న బాల, ప్రౌఢ వ్యాకరణాలలోని కొన్ని అంశాలను గ్రహించి, కొన్ని నూతన అంశాలను చేర్చి కొత్త వ్యాకృతని నిర్మించారు.

## 2. 'సులభవ్యాకరణము' రచనా నేపథ్యం

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-4, (Oct,Nov,Dec), 2025

తెలుగులో వచ్చిన సంప్రదాయ వ్యాకరణాలలో 'సులభవ్యాకరణము' నకు ఒక ప్రత్యేక స్థానం ఉంది. వావిలికొలను సుబ్బారావుగారు ***సులభవ్యాకరణము*** మొదటి కూర్పు పీఠికలో ఈ గ్రంథ రచనకు పూనుకోవడానికి గల కారణాలను ప్రస్తావించారు. వ్యాసలేఖనం గురించి విద్యార్థులు తెలుసుకోవడానికి సరైన గ్రంథం లేదని, ఏది చదవాలి? ఎలా రాయాలి అనే విషయాల పట్ల వారికి అవగాహన లేదని, వారికి బోధించే కొంతమంది అధ్యాపకులకు కూడా తెలియదని బాధపడ్డారు.

విద్యార్థులు వ్యాసం రాసేటప్పుడు వాక్యాలలో తెలుగు పదాలు , ఇంగ్లీషు పదాలు, ఉర్దూ పదాలు, స్వజాతిపదాలు, గ్రామ్య పదాలు కలిపి మిశ్రమ పదాలు రాయడం, కొన్నిసార్లు ఇంగ్లీషు అక్షరాలతోనే పదాలు రాయడం, ఏకవచనంలో కర్తను ఉంచి బహువచనంలో క్రియను రాయడం, స్త్రీలింగ విశేష్యానికి పుంలింగ విశేషణం పెట్టడం ఇలా చిత్ర విచిత్రాలుగా సంకర శైలిని రాస్తున్నారని; ఇలాంటి పరిస్థిలను పోగొట్టడానికి నా శక్తిని అనుసరించి ***సులభవ్యాకరణాన్ని*** రచించానని వావిలికొలనువారు చెప్పుకున్నారు.

వావిలికొనువారు ***సులభవ్యాకరణాన్ని*** ఆంగ్లేయుల వ్యాసలేఖన గ్రంథాలను అనుసరించి రచించానని చెప్పారు. నేను చెప్పే విషయాలకు కొంత ఉపబలాన్ని చేకూర్చే విషయాలను ఆంగ్ల గ్రంథాల నుండి అనువదించినప్పటికీ, విద్యార్థులు వ్యాసాలలో రాసే దోషాలను గ్రహించి ఈ గ్రంథంలో చేర్చి సవరించానని అన్నారు. వ్యాసాలు రాసేవారికి, క్షుద్ర గ్రంథాలు రాసేవారికి ఈ గ్రంథం ఉపయోగపడుతుందని, ఈ గ్రంథంలో చెప్పాల్సిన విషయాలు ఇంకా ఉన్నప్పటికీ, ఆవశ్యకమైన విషయాలు విడవలేదని వావిలికొలను సుబ్బారావుగారు చెప్పారు.

వావిలికొలనువారు రెండవకూర్పు పీఠికలో ***సులభవ్యాకరణము*** గురించి "తొలుత నీ గ్రంథమును గేవల విద్యార్థులకే యుద్దేశించి వ్రాసితినిగాని యనుభవమునఁ దదితరులకు నిది ప్రయోజన పడుచుండుట యెఱిఁగితిని. ఈ కూర్పునందు నెక్కువ విషయములు చేర్పఁబడినవి. అవి విద్యార్థులకేగాక కుఱ కుఱ గ్రంథకర్తలకును, సాధుభాష యందు కథలు వ్యాసములు లోనైనవి వ్రాయువారికి విశేషముగ నుపయోగపడఁగలవని నమ్మెదను"[1] అని చెప్పారు.

---

[1] సులభ. పీఠిక.పుట:70

వావిలికొలను సుబ్బారావుగారు 'సులభవ్యాకరణాన్ని' మూడు భాగాలుగా వెలువరించారు. సంజ్ఞా, సంధి పరిచ్ఛేదాలను ప్రథమ భాగంలో పేర్కొన్నారు. విద్యార్థుల ఆదరణతోపాటుగా పండితుల ప్రోత్సాహాన్ని పురస్కరించుకొని ద్వితీయ, తృతీయ భాగాలను కూడా రచించారు. ద్వితీయ భాగంలో తత్సమ, ఆచ్ఛిక, కారక, సమాస, తద్ధిత, క్రియా, కృదంత, ప్రకీర్ణ పరిచ్ఛేదాలు, తృతీయ భాగంలో వ్యాసపరిచ్ఛేదాన్ని పొందుపరిచారు. మొత్తంగా ఈ వ్యాకరణంలో పన్నెండు పరిచ్ఛేదాలు ఉన్నాయి.

### 3. సులభ వ్యాకరణ నిర్మాణ క్రమం

వావిలికొలను సుబ్బారావుగారు 'సులభవ్యాకరణము' లో అనుసరించిన నిర్మాణ క్రమాన్ని పరిచ్ఛేదాల ఆధారంగా ఈ క్రింద పేర్కొంటాను.

### 3.1.సంజ్ఞా పరిచ్ఛేదం

వావిలికొలను సుబ్బారావుగారు సంజ్ఞాపరిచ్ఛేదాన్ని 78 సూత్రాలలో చెప్పారు. బాలవ్యాకర ణంలో 'సంజ్ఞా పరిచ్ఛేదం'లో చెప్పబడిన 23 సూత్రాలలోని అంశాలను వదలకుండా సులభవ్యాకర్త తన వ్యాకరణంలో చెప్పారు. ప్రౌఢవ్యాకరణంలో 'సంజ్ఞా పరిచ్ఛేదం' లో చెప్పబడిన అంశాలను పెద్దగా చర్చించలేదు. బాలవ్యాకరణంలో ఒకే సూత్రంలో చెప్పిన నాలుగు, ఐదు విషయాలని సులభ వ్యాకర్త విడివడిగా సూత్రాలుగా చెప్పారు. సంజ్ఞాపరిచ్ఛేదంలో ప్రధానమైన సంజ్ఞలను ప్రకరణాలుగా విభజించి వివరించారు. అక్షర ప్రకరణం, గుణింత ప్రకరణం, వర్ణ విభాగ ప్రకరణం, అనుస్వార ప్రకరణం, అర్ధబిందు నిర్దేశ ప్రకరణం, దంత్య తాలవ్య ప్రకరణం, అంతస్థ ప్రకరణం, సంజ్ఞా ప్రకరణం, కళా ప్రకరణం, ద్రుత ప్రకృతికాలు, ఆంధ్ర భాష విభజన మొదలైనవి అంశాలు ఉన్నాయి.

తెలుగు భాషకు ప్రారంభదశ నుండి సంస్కృత, ప్రాకృత భాషలతో సన్నిహిత సంబంధమున్నది. అందుకే వావిలికొలనువారు తెలుగు భాషకు మొదటి ఉత్పత్తి స్థానంగా **"సంస్కృతం బాద్య ప్రకృతి"(సులభ. సంజ్ఞ:6)** సంస్కృతాన్ని, రెండవ ఉత్పత్తి స్థానంగా **"ప్రాకృతము ద్వితీయ ప్రకృతి(సులభ. సంజ్ఞ:7)** ప్రాకృతాన్ని ఆయా సూత్రాల్లో పేర్కొన్నారు

వావిలికొలనువారు ఆంధ్రశబ్ద చింతామణిని అనుసరించి సాధారణ సంజ్ఞలను, విశేష సంజ్ఞలను కొన్నింటిని సూత్రాలుగా సంజ్ఞా పరిచ్ఛేదంలోనే పేర్కొన్నారు. **"అనుస్వారము సున్న" (సులభ. సంజ్ఞ:18), "ప్రాతిపదికము**

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-4, (Oct,Nov,Dec), 2025

**నామము"(సులభ. సంజ్ఞ:50), "ప్రత్యయము వర్ణకము" (సులభ. సంజ్ఞ:51). "ధాతువు క్రియ" (సులభ. సంజ్ఞ:52)** మొదలైనవి.

### 3.2 సంధి పరిచ్ఛేదం

వావిలికొలనుసుబ్బారావుగారు సంధిపరిచ్ఛేదంలో తెలుగు సంధులకు సంబంధించి 90 సూత్రాలు, సంస్కృత సంధులకు సంబంధించి 30 సూత్రాలను పేర్కొన్నారు. బాల, ప్రౌఢ వ్యాకరణంలోని కొన్ని అంశాలను సులభ వ్యాకర్త చర్చించారు. బాలవ్యాకరణంలో ప్రకీర్ణక పరిచ్ఛేదంలో చెప్పిన కొన్ని సూత్రాలను సందర్భోచితంగా సులభ వ్యాకర్త సంధి పరిచ్ఛేదంలో వివరించారు. అచ్సంధులను అకారాది క్రమంలో సూత్రీకరించారు. కొన్ని విశేష సంజ్ఞలను సూత్రాలుగా చెప్పారు . సంస్కృత సంధులను కూడా ఈ పరిచ్ఛేదంలో సులభవ్యాకర్త చర్చించారు. ఈ సంధి పరిచ్ఛేదంలో అచ్సంధి ప్రకరణం, స్వరలోప ప్రకరణం, కళాసంధి ప్రకరణం, ద్రుతసంధి ప్రకరణం, సమాసగత పద సంధి ప్రకరణం, నుగాగమ ప్రకరణం, తుగాగమ ప్రకరణం, ఆమ్రేడిత ప్రకరణం, ముపర్ణక ప్రకరణం, ధ్వన్యనుకరణ ప్రకరణం, సంస్కృత శబ్ద ప్రయోగ ప్రకరణం సంస్కృత శబ్ద సంధి ప్రకరణం ఉన్నాయి.

వావిలికొలనుసుబ్బారావుగారు సంధి లక్షణాన్ని చిన్నయసూరిగారు చెప్పిన నిర్వచనాన్నే స్వీకరించి "**పూర్వపరస్వరంబులకుం బరస్వరం బేకాదేశంబగుట సంధి" (సులభ. సంధి:1)** అని సంధి గురించి సూత్రీకరించారు. అంటే వావిలికొలను వారి దృష్టిలోకూడా అచ్చుకు అచ్చు పరమైనప్పుడే సంధి అవుతుందని గుర్తించవచ్చు. ఈ సూత్ర వివరణలో వావిలికొలనువారు తెలుగుభాషలో 'అ, ఇ , ఉ' అనే మూడచ్చుల మీద అచ్చులు వచ్చినప్పుడే మాత్రమే సంధి వస్తుంది తప్ప మిగిలిన అచ్చుల మీద అచ్చులు వచ్చిన సంధి జరగదు అని సులభ వ్యాకర్త చెప్పారు.

### 3.3 తత్సమ పరిచ్ఛేదం

అజంతాలు, హలంతాలైన సంస్కృత పదాలు తెలుగులో ఉపయోగించినప్పుడు ఆ సంస్కృత ప్రాతిపదికలను తెలుగు పదాలుగా మార్చే విధానం ఇందులో ఉంటుంది. ఈ పరిచ్ఛేదంలో మొదటి సూత్రం నుంచి ఎనిమిదవ సూత్రం వరకు విభక్తి పేరు, వాటిలో వచ్చే ప్రత్యయాలను పేర్కొన్నారు. తరువాత ఆ విభక్తులు ఏకవచనంలో ఏవేవి వస్తాయో, బహువచనంలో ఏవేవి వస్తాయో పేర్కొన్నారు. ఈ పరిచ్ఛేదంలో సులభవ్యాకర్త మొత్తం103 సూత్రాలు ఉన్నాయి.

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-4, (Oct,Nov,Dec), 2025

సులభ వ్యాకర్త కూడా తత్సమ పరిచ్ఛేదంలో మొదట ఎనిమిది సూత్రాలలో నామ విభక్తి ప్రత్యయలనే పేర్కొన్నాడు. సులభ వ్యాకర్త'సంబోధనా ప్రథమా విభక్తి' ని ప్రత్యేకంగా సూత్రంలో చెప్పారు. **"ప్రథమా విభక్తి :ఁడు-ము-వు-లు"(సులభ. తత్సమ:1), "ద్వితీయా విభక్తి: ని-ను-ల" (సులభ. తత్సమ:2) "తృతీయా విభక్తి: చేత-చే-తోడ-తో" (సులభ. తత్సమ:3) "చతుర్థీ : కై -కొఱకు"(సులభ. తత్సమ:4),"పంచమీ విభక్తి: వలన- కంటె-పట్టి"(సులభ. తత్సమ:5),"షష్ఠీ విభక్తి: కి-కు -యొక్క-లోపల-లో ""(సులభ. తత్సమ:6)"సప్తమీ విభక్తి : అందు- న"(సులభ. తత్సమ:7),"సంబోధన ప్రథమా విభక్తి: ఓ-ఓయి-ఓరి-ఓసి" "(సులభ. తత్సమ:8).** సులభవ్యాకర్త పైన చెప్పిన సూత్రాలను ఒకచోట చెప్పి క్రింద కొంత వివరణ ఇచ్చారు. 'ఁడు' మొదలైన వాటికే వర్ణకాలని ప్రత్యయాలని పిలుస్తారని సులభవ్యాకర్త చెప్పారు. ఒక శబ్దానికి ఆయావిభక్తియందు రూపం చెప్పాలనుకున్నపుడు ఆయా విభక్తికి ఎదురుగ ఉండే ప్రత్యయాలలో ఒకటి చేర్చాలి. ఉదాహరణకు 'రామ'శబ్దానికి తృతీయావిభక్తి రూపం 'రాము చేత-రాము చే-రాముతోడ-రాముతోనని చెప్పాలి. ఏ అర్థంలో ఏ ప్రత్యయం చేర్చాలో వంటి విషయాలు కారక పరిచ్ఛేదంలో వివరింపడుతుంది. పై ప్రత్యయాలలో ప్రథమ విభక్తి ప్రత్యయాలు,'కై-పట్టి యొక్క' అనేవి కళలు. మిగిలిన నుగాగమంబులు ద్రుతప్రకృతికాలు అని సులభవ్యాకర్త చెప్పారు.

### 3.4 ఆచ్ఛిక పరిచ్ఛేదం

ఆచ్ఛికం అంటే అచ్చ తెలుగు అని అర్థం. ఏకాది గణాలలో చేరిన ఒక్కడు-వాడు- వీడు- మగడు' మొదలైన శబ్దాలు కాకుండా మిగిలిన అచ్చతెలుగు శబ్దాలన్ని స్త్రీ సమాలుగా కానీ, క్లీబ సమాలుగా కానీ అవుతాయని సులభవ్యాకర్త నిర్వచించారు. ఈ ఆచ్ఛిక పరిచ్ఛేదంలో 71 సూత్రాలు ఉన్నాయి. సర్వనామాలు, ఔపవిభక్తికాలను ఈ పరిచ్ఛేదంలో చర్చించారు.

### 3.5. కారక పరిచ్ఛేదం

సులభవ్యాకర్త **"వాక్యంబునఁ గర్తకుఁ గ్రియకుఁ గల యన్వయ సంబంధమును దెలుపునది కారకము. ఇది కర్త-కర్మము-కరణము-సంప్రదానము-అపాదానము-అధికరణము అని యాఱు విధములు" (సులభ. కారక:1)** అని కారకాన్ని నిర్వచించారు. వాక్యంలో కర్తకు క్రియకు గల అన్వయ సంబంధాన్ని తెల్పేది కారకం. ఇది కర్త, కర్మ, కరణ, సంప్రదాన, అపాదాన, అధికరణం అని ఆరు రకాలు. ఈ కారక పరిచ్ఛేదంలో 43 సూత్రాలున్నాయి.

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-4, (Oct,Nov,Dec), 2025

**3.6. సమాస పరిచ్ఛేదం**

**"ప్రసిద్ధముగ వేఱువేఱగు నర్థంబులు గల పదంబు లేకపదం బగుట సమాసంబు" (సులభ.సమాస:1).** అని సమాస లక్షణాన్ని వావిలికొలను వారు నిర్వచించారు. ఆయన దృష్టిలో ప్రసిద్ధమైన పదాలు కలిసి ఒక పదంగా ఏర్పడటం సమాసమని అర్థమవుతుంది. ఈ సమాస పరిచ్ఛేదంలో 70 సూత్రాలు ఉన్నాయి.

భాషా భేదం చేత సమాసం మూడు రకాలు. అవి సాంస్కృతికం, ఆచ్ఛికం, మిశ్రమం. సాంస్కృతికం మళ్ళీ సిద్ధము, సాధ్యము అని రెండు రకాలు. విభక్తి లోపం వల్ల సమాసం రెండు విధాలు. విభక్తి లోపిస్తే 'లుక్సమాసం' అంటారు. విభక్తి లోపించకపోతే 'అలుక్సమాసం' అంటారు. అర్థ భేదం చేత సమాసం నాలుగు రకాలు 1. ద్వంద్వము 2. తత్పురుష 3. బహుబ్రీహి 4. అవ్యయీ భావం. వీటి ఉప విభాగాలను కూడా ఈ గ్రంథంలో సులభ వ్యాకర్త చర్చించారు.

**3.7. తద్ధిత పరిచ్ఛేదం**

భావాద్యర్థాలలో 'తన' మొదలైన తద్ధిత ప్రత్యయాలు ఆచ్ఛిక ప్రాతిపదికల మీద చేరే విధానం మొదలైన వివరణ ఈ పరిచ్ఛేదంలో ఉంది. "**విశేష్యములకుగాని విశేషణములకుగాని భావార్థము స్వార్థములోనగు నర్థంబుల రాదగిన యొక విధమైన ప్రత్యయములు తద్ధితము లనబడును" (సులభ.తద్ధిత:1).** అనగా నామాలకుగాని, విశేషణాలకుగాని భావార్థంలో, స్వార్థంలో, మతుబదర్థం మొదలయిన అర్థాలలో చేరే వివిధ ప్రత్యయాలను **'తద్ధితాలు'** అంటారని వావిలికొలనువారు నిర్వచించారు. ఈ ప్రత్యయాలు పరమైనప్పుడు 'డు' వర్ణకం మొదలైన ప్రత్యయాలు లోపిస్తాయి. ఈ తద్ధిత పరిచ్ఛేదంలో 41 సూత్రాలు ఉన్నాయి.

3.8. **క్రియా పరిచ్ఛేదం**

ధాతువుల నుండి సమాపక క్రియలు, అసమాపక క్రియలు, విశేష్యాలు, విశేషణాలు ఎలా ఏర్పడతాయో ఈ క్రియా పరిచ్ఛేదంలో వివరించబడింది. సులభవ్యాకర్త ఈ పరిచ్ఛేదంలో 136 సూత్రాలు ఉన్నాయి. వావిలికొలనువారు క్రియలను తత్సమాలు, ఆచ్ఛికాలు అని రెండు రకాలుగా విభజించారు. **"సంస్కృత ధాత్వాదులకు 'ఇంచు' చేర్పఁగా నైనవి తత్సమక్రియలు"(సులభ. క్రియా:1)**. సంస్కృత ధాతువులకు 'ఇంచు' చేర్చగా ఏర్పడేవి తత్సమక్రియలు. ఉదాహరణకు ' రంజించు, పోషించు, స్తుతించు. ఆచ్ఛిక క్రియలకు ఉదాహరణ 'చేయు , కొట్టు, తిట్టు'.

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-4, (Oct,Nov,Dec), 2025

సులభ వ్యాకర్త క్రియలను రెండు రకాలుగా చెప్పారు. **"కర్మమును గోరునది సకర్మము" (సులభ. క్రియా:2)**. కర్మను కోరేది సకర్మకం . ఉదాహరణకు 'శూరుడు శత్రువులను కొట్టును'. **"కర్మమును గోరనిది అకర్మకము" (సులభ. క్రియా:3).** కర్మను కోరనిది అకర్మకం. ఉదాహరణకు 'అవివేకి పట్టిన కార్యము పాడగును'.

సమాక క్రియలు లైన 'వర్తమానార్థకం, భూతార్థకం, భవిష్యదర్థకం, తద్ధర్మాదులు, ఆశీశ్శాప సంప్రార్థనా విధులు, వ్యతిరేకార్థకాల్ని, అసమాపక క్రియలైన 'భావర్థకం, క్త్వార్థం, చేదర్థకం, ఆనంతర్యార్థకం, శత్రర్థకాలను,' ధాతుజ విశేషణాలు, ఇంచుక్ ప్రకరణం- ప్రేరణార్థక క్రియలను ఈ పరచ్ఛేదంలో చర్చించారు.

### 3.9. కృదంత పరిచ్ఛేదం

ధాతువుల నుంచి ఏర్పడే నామవాచకాలని కృదంతాలు అంటారని సులభవ్యాకర్త మొదటి సూత్రంలో నిర్వచించారు. **" ధాతువుల వలన గలుగు నామవాచకములు కృదంతములు" (సులభ. కృదంత:1).** ఈధాతువుల మీద చేరే ప్రత్యయాలను కృత్తులు అంటారని రెండవ సూత్రంలో చెప్పారు. **"ఈ నిమిత్తమై ధాతువులకు జేర్పబడు ప్రత్యయములు కృత్తులు"(సులభ.కృదంత:2).** అంతేకాకుండా 'కృత్' ప్రత్యయాలు చేరేటప్పుడు ధాతువుల చివర ఉండే ప్రత్యయాలు కొన్ని లోపిస్తాయని తరువాత సూత్రంలో వావిలికొలనువారు చెప్పారు. ఈ కృదంత పరిచ్ఛేదంలో 23 సూత్రాలు ఉన్నాయి.

**"కవర్ణకం బలుగాద్యదులకగు" (సులభ. కృదంత:4).** 'అలుగు' మొదలైన ధాతువులు నామవాచకాలైనప్పుడు 'క' ప్రత్యయం వస్తుంది. ఉదాహరణకు ' అలుగు- అలుక' నడచు- నడక' . 'కలుగు' మొదలైన శబ్దాలకు 'ఇమి' వర్ణకం వస్తుంది. ఉదాహరణకు ' కలుగు- కలిమి', నేరుచు- నేరుమి'. 'చేయు' మొదలైన ధాతువులకు 'తజ్' వర్ణకం వస్తుంది. ఉదాహరణకు 'చేయు- చేత' . పూయు- పూత'. 'అడుగు' మొదలైన ధాతువులకి 'కువ' వర్ణకం వస్తుంది. ఉదాహరణకు ' ఆడగు- అడకువ'. 'లోగు- లోకువ'.'వడి' మొదలైన ప్రత్యయాలు ధాతువులపైన చేరే విధానాన్ని మహా కవులు ప్రయోగాలను బట్టి తెలుసుకోవాలని చివరి సూత్రాన్ని వావిలికొలనువారు చెప్పారు. ఉదాహరణకు ' కొలువడి, నడవడి, లేమిడి.

### 3.10. ప్రకీర్ణక పరిచ్ఛేదం

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-4, (Oct,Nov,Dec), 2025

ముందు పరిచ్ఛేదాలలో చెప్పగా మిగిలిన కొన్ని భాషారూపాల ప్రక్రియలను ప్రతిపాదించేది ప్రకీర్ణక పరిచ్ఛేదం. ప్రధానంగా ఆచ్ఛిక శబ్దాలలో కలిగే ధ్వనుల మార్పులు ఈ పరిచ్ఛేదంలో వావిలికొలనువారు చెప్పారు. ఈ పరిచ్ఛేదంలో 17 సూత్రాలు ఉన్నాయి.

సులభవ్యాకర్త కూడా **"పదాద్యంబులు ఋ ౠ వర్ణంబులు, ర ల తుల్యంబులు" (సులభ. ప్రకీర్ణక:1)** అని సూత్రీకరించారు. పదంలో మొదట అక్షరాలుగా ఉండే ఋ ౠ వర్ణాలు రకార, లకారాలతో సమానం. అనగా ఋ ౠ అచ్చులైనను వాటికి సంధి కార్యాలు చేసేటప్పుడు హల్లులైన 'ర-ల' లు పరమైనపుడు ఎటువంటి కార్యాలు జరుగుతాయో అటువంటి కార్యాలు వీటికి కూడా వర్తిస్తాయని సులభ వ్యాకర్త చెప్పారు . ఉదాహరణకు ' అతఁడు ఋషి , ఆ ఋషి . వచ్చెన్ ఋషి, వచ్చెను ఋషి'.

**3.11. వాక్య పరిచ్ఛేదం**

వావిలికొలను సుబ్బారావుగారు **'విషయబోధక పద రచన వాక్యంబు'.(సులభ. వాక్య:1)** అని సూత్రీకరించి విషయాన్ని బోధించు పదాలను లేదా పద సముదాయాన్ని వాక్యమని నిర్వచించారు. కొన్ని విషయాలను సైగల చేత తెలుపవచ్చని అలాంటి చేష్టలు వాక్యాలు కావని సులభవ్యాకర్త చెప్పారు. నోటి నుండి వచ్చు ధనులన్నీ పదాలు కావని, మూగవారు, శిశువులు సైగలచేత తమ అభిప్రాయాన్ని తెల్పినప్పటికీ అవి వాక్యాలు అనిపించుకోవని సులభవ్యాకర్త చెప్పారు. ఈ వాక్య పరిచ్ఛేదంలో 65 సూత్రాలు ఉన్నాయి. 'వాక్య విజ్ఞానానికి' సంబంధించి పదం, సంబోధనార్థం, నిత్య ఏకవచనాలు, నిత్య బహువచనాలు, కర్తృర్థక వాక్యాలు, విశేషణార్థక వాక్యాలు, అస్మద్- యుష్మద్ వాక్యాలు, కాలబోధక వాక్యాలు, అద్యాహార్యం, సమాసం, విభక్తులు మొదలైన అంశాలు ఈ పరిచ్ఛేదంలో ఉన్నాయి.

**"అర్థవంతమై, యన్వయయుక్తమై, ప్రయోగర్హంబైనది పదంబు" (సులభ.వాక్య:2).** పదాలు అర్థవంతాలై ప్రయోగార్హతతో దేనితో ఏది అన్వయించునో ఆ పదాలు చేరి ఉండాలి. అన్వయం సంబంధం గల రెండు పదాల మధ్యలో సంబంధం లేని వేరొక పదం రాకూడదు. పదానికి ఖచ్చితంగా ఏదొక అర్థంఉండాలి. ఈ పదాలను వావిలికొలనువారు ఐదు రకాలుగా సూత్రీకరించారు. అవి1.నామాలు,2. క్రియలు., 3. అవ్యయాలు 4. విశేషణాలు 5. సర్వనామాలు.

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-4, (Oct,Nov,Dec), 2025

కర్త, కర్మ, క్రియలను నిర్వచించి కర్తరివాక్యాన్ని, కర్మణి వాక్యం నిర్వచించారు. 'క్రియచేత గర్త చెప్పబడిన కర్తరి ప్రయోగము'. అలాగే' క్రియచేత కర్మము చెప్పబడునేని యది కర్మణి ప్రయోగము'. సమాపకక్రియగల వాక్యం సంపూర్ణ వాక్యం' అని నిర్వచించారు. అసమాపక క్రియగల వాక్యంబు సంపూర్ణ వాక్యంబు.

3.12. **వ్యాస పరిచ్ఛేదం**

వావిలికొలను సుబ్బారావుగారు ***వ్యాస పరిచ్ఛేదం***లో వ్యాసం రాసేటప్పుడు విద్యార్థులు చేసే తప్పులను ప్రస్తావించారు. వ్యాసం రాసేటప్పుడు ఒక విద్యార్థికి ఉండాల్సిన లక్షణాలను, నియమాలను 21 భాగాలుగా విభజించి పూర్వభాగంలో చెప్పారు. ద్వితీయ భాగంలో సంస్కృత శబ్దాలను, తెలుగు శబ్దాలను రాసేటప్పుడు విద్యార్థులు చేసే తప్పులను కొన్నింటిని ఉదాహరించారు.

ఏదైనా ఒక విషయాన్ని విస్తరించి రాయడం వ్యాసలేఖనమని, ఆ విస్తరించి రాయబడ్డ గ్రంథం వ్యాసమని వావిలికొలను సుబ్బారావుగారు నిర్వచించారు. ఆయన వ్యాసలేఖనాన్ని ఒక శిల్పంగా భావించారు. వడ్రంగికి కొయ్య ఎలాంటిదో, లోహకారునికి లోహం ఎలాంటిదో, వ్యాసలేఖకుడికి మాటలు ప్రధాన పదార్థాలు. మంచి పదార్థాలతో శిల్పి మంచి రూపాన్ని కల్పించినట్లుగా, మేలి మాటలతో వ్యాసలేఖకుడు ఉత్తమ వ్యాసాన్ని రాస్తున్నాడని వావిలికొలను సుబ్బారావుగారు అన్నారు. విద్యార్థులు పరీక్షకోసం పరీక్షాశాలకు వెళ్ళినప్పుడు వారు గుర్తుంచుకోవాల్సిన విషయాలను కూడా వావిలికొను సుబ్బారావుగారు ఈ వ్యాస పరిచ్ఛేదంలో ప్రస్తావించారు.

**ముగింపు**

వావిలికొలను సుబ్బారావుగారు *సులభవ్యాకరణాన్ని* చక్కని ప్రణాళికతో రచించారు. ప్రతి పరిచ్ఛేదంలో చెప్పాలనుకున్న విషయాలను ఒక క్రమంలో చక్కగా ప్రకరణాలుగా విభజించి చర్చించారు. ఈ గ్రంథాన్ని అధ్యయనం చేస్తున్నప్పుడు పేరుకు తగిన గ్రంథంగా మనకు కనిపిస్తుంది. వావిలికొలనువారు ఈ వ్యాకరణంలో చాలా వరకు సూత్రం క్రిందనే వివరణ ఇచ్చారు. సంస్కృత సంధులను తెలుగు వ్యాకరణ గ్రంథంలో చర్చించటం, వ్యాస పరిచ్ఛేదాన్ని పొందుపరచటం ముఖ్యంగా చెప్పుకోవాల్సిన విశేషాంశాలుగా ఈ గ్రంథంలో కన్పిస్తున్నాయి. ప్రస్తుత నా వ్యాసంలో సులభవ్యాకరణంలోని ముఖ్యమైన అంశాలను చర్చిస్తూ ఆ గ్రంథ వైశిష్ట్యాన్ని తెల్పడానికి ప్రయత్నం చేశాను.

**ఉపయుక్త గ్రంథసూచి**

భాస్కరరావు, టి. 1992. ***బాల ప్రౌఢ వ్యాకరణ సర్వస్వము(ప్రథమ&ద్వితీయ సంపుటాలు)***. కాకినాడ: ప్రశాంతి పబ్లిషర్స్. ఐదవ ముద్రణ.

మోహన్ రెడ్డి, ఆలేటి.2014. ***బాలవ్యాకరణము (తెలుగు వ్యాఖ్య).*** హైదరాబాదు: ఎమెస్కో ప్రచురణలు. ప్రథమముద్రణ.

రాజేశ్వరశర్మ, అమరేశం. 1973. ***ఆంధ్రవ్యాకరణ వికాసము(ప్రథమ&ద్వితీయ భాగములు)***. కామారెడ్డి: ప్రాచ్యవిద్యాపరిషత్తు. ప్రథమ ముద్రణ.

రామకృష్ణారావు, వంతరాం. 2017. ***బాలవ్యాకరణ ఘంటాపథము***. హైదరాబాద్: నవచేతన పబ్లిషింగ్ హౌస్. ప్రథమ ముద్రణ.

రామకృష్ణారావు, వంతరాం.2011. ***ప్రౌఢవ్యాకరణ ఘంటాపథము***. హైదరాబాద్ : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్. ద్వితీయ ముద్రణ.

లలిత, జి.1996. ***తెలుఁగు వ్యాకరణముల చరిత్ర***. మద్రాసు: వెలగపూడి ఫౌండేషన్.

సుబ్బారావు, వావిలికొలను.1963. ***సులభ వ్యాకరణము***. అంగలకుదురు: శ్రీ కోదండరామసేవక ధర్మసమాజము. ప్రథమ ముద్రణ.